# వెన్నెల దండ

ఏడిస్తే ఎందుకేడుస్తున్నారో తెలుసుకోవచ్చు గాని. నవ్వితే ఎందుకు నవ్వుతున్నారో తెలుసుకోలేం ?

పిల్లలకు ఏడుపే అధికార భాష- నవ్వుకాదు ! అప్పుడే పుట్టిన పసిపాపకూడా ముందు ఏడ్చినా తరువాత నవ్వులు వొలకబోస్తుంది. ఎందుకో ఎవరికీ తెలీదు. కొన్నాళ్ళు – కొన్నేళ్ళు పోతే – ఆ పాప కూడా మళ్ళీ అలా నవ్వలేదేమో....

ఏడుపుకి వున్నన్ని అర్థాలు నవ్వుకి లేవు. బుగ్గలు సొట్టలుపడేలా పాపలు నవ్వితే చూడ ముచ్చటగా వుంటుంది.

పసిపాప పాలకోసం వూహూఁ తడువుకొంటుంది. మూతితో ఆ వెతుక్కోవడం చాలా తమాషాగా వుంటుంది. ఎవరెత్తుకున్నా పాప అట్లానే తడుముకుంటే – కాలేజీ అమ్మాయిలు సిగ్గుపడిపోతారు. వాళ్ళ నాన్నగారెత్తుకున్నా అంతే. పాప ఎందుకోసం అలా తడుముకుం టోందో తెలియనట్లు నటిస్తారు మగాళ్ళు. ఆముదంపోస్తే అదేదో గిట్టనట్లు మూతి అష్ట వంకర్లు త్రిప్పుతారు పాపలు కాళ్ళమీద పడుకుని, ఆ వంకర్లు ఎంత బావుంటాయని ? ఆర్టిస్టులు గీయలేరు. కొన్నాళ్ళు ఏడుపే వాళ్ళకు అఫిషియల్ లాంగ్వేజి. పక్క తడుపుకుంటే, ఆకలేస్తే, చీదరగా వుంటే – కొత్త మొహాలు గిట్టకపోతే, నిద్ర రాకపోతే, పక్క లోంచి తల్లి లేచిపోతే, ఆ వెచ్చదనంకోసం– అన్నిటికీ ఏడుపే — కడుపులో నొప్పిపుడితే గుక్కపట్టి ఏడుస్తారు. ఉయ్యాలలో పడుకోబెట్టి వూపితే, జోలపాడితే హాయిగా నిద్రపోతారు. గిలక్కాయలు చేతి కందిస్తే గుప్పిటతో పట్టుకుని నోట్లో పెట్టేసుకుంటారు పాపాయిలు.

అన్నిటికీ పాపాయిలు మహా నోరుచేసుకుంటారు, నోరున్నవాళ్ళదే రాజ్యం, అవును, వాళ్ళదే రాజ్యం! పాపాయిని చూసి ఈర్ష్యపడేది చేసుకున్న మగాళ్ళే, నీ కష్టమానూ పాపతోటే సరిపోతుంది అని విసుక్కుంటారు. "ఆ అదే వంక నీకు" అని గునుస్తారు. పాప పక్కలో బజ్జుంటే వూరుకోరు. మోచేతుల్తో పొడుస్తారు. చెంగు పట్టుకు లాగుతారు, నెత్తిమీద చిటికవేస్తారు, జడపట్టుకు పీకుతారు. "ఏం గోలొచ్చి పడింది చెప్మా" అని తెల్ల తెలబోయి చూస్తే మోనోయాక్షన్ ప్రారంభిస్తారు. పుట్టింట్లో పురుడు పోయించుకుంటే ఈగోల తప్పుతుందంటే — అది వోల్డు ఫాషనయిపోయిందిగదా! ఆసుపత్రినుంచి రాగానే పెద్దపురుడు శొంఠికాయం పథ్యం పానం లేకుండానే రిక్షాలో సినిమాకు రమ్మంటారు. ఒళ్ళంతా పచ్చి పుండు— చాకిరీ తప్పదు. పైగా నీరసాలూ సారసాలూ, ఈ మగాళ్ళకు ఇవ్వేమీ అర్థమయి చావవు. ఎవరి గొడవ వాళ్ళది. ఏ మొచ్చినా డాక్టర్లు చూసుగుంటార్లే అన్నధీమా ఒహటి. దూరం దూరం అంటున్నకొద్దీ మనకు దగ్గిరవుతూ వుంటారు, ఈ బాధ తప్పించుకోడానికి ఓ ముసలమ్మను తెచ్చి సాయం పడుకోపెట్టుకుంటే- చిందులు తొక్కుతారు. ఎగదీస్తే గోహత్య దిగదీస్తే బ్రహ్మ హత్యానూ, దీనంగా దిగులుగా క్వశ్చన్ మార్కులు మెళ్ళో వేసుకు తిరుగుతారు. చెప్పొద్దూ జాలేస్తుంది. చేసుకున్న మగాడ్ని కష్టపెట్టి ఏం బావుకుంటాంలెద్దూ అనిపిస్తుంది. ఈ జాలే కొంపదీస్తుందనుకోండి. మళ్ళీమళ్ళీ పురుళ్ళు, మళ్ళీమళ్ళీ ఆసుపత్రులు, పాల డబ్బాలు.... తొంబ సంసారం క్రింద పెరుగుతుంది. పెరిగితే మగాడికి చికాకూ పెరుగుతుందిగా- ఫస్టుతారీఖు నెల్లో ఒక్కసారే వస్తుంది.

మొగాడంటే అగ్నిరథం కదా! ఇంజనుకు ఇంధనం ఆడదే. ఆడది వండి వార్చి పడెయ్యాలిసిందే. కేవలం వంటమనిషిలా కనపడే ఆడదే జగన్మోహినిలా అవతారంఎత్తి అమృతం పంచకపోతే కొంపలో దేవదానవులు కొట్లాడుకుంటారు. మొగుడే దేవుడు— మొగుడే దానవు

డూనూ, చాకిరికి రాక్షసి.... చీకట్లో మోహిని. బొమ్మ బొరుసులాటి స్థితిని తప్పించుకు పారిపోవడానికి వీలా? కాళ్ళకు చుట్టుకునే ప్రేమపాశాల్ని త్రెంచుకోవడం ఎలా? మొగుడూ, పిల్లలు సంసారం అన్నాక ప్రేమలూ పురుళ్ళూ తప్పవు. గోడలకి చెవులుంటే, దిళ్ళూ పరుపులూ మంచాలూ చెప్పే కథల్ని అవి వినగలిగితే ఎన్నో రహస్యాలు తెలుస్తాయి. కిటికీలు మూసుకుని దీపం ఆర్పుకున్నాక స్త్రీ సమస్యా, పురుషుల సమస్యా ఒకటే.... చెట్టుమీది పిట్టల్నడిగితే, అరణ్యాలలోని వన్యమృగాలను పలకరిస్తే, (అద్దెకొంపలలోనూ చీకట్లోనూ ముక్కిపోయే స్త్రీ పురుషుల సమస్యకూడా ఒకటే) సృష్టిలోని జీవకోటిని పరిశీలిస్తే అవి ఎంచక్క దాంపత్యధర్మాలు నెరవుకొంటున్నాయో చూడముచ్చటవుతుంది. కోళ్ళు, పిచికలు. పిల్లులూ, కుక్కలు కూడా మనకంటే నయమేనేమో — సహజమైనజీవితానికి దూరంగా పారిపోయి సమస్యల లుంగీలు ధరించి ఆవేశకావేషాల చీరల్నూ చుట్టుగుని బావుకునేదేమిటి?

పాపల అధికార భాష ఏడుపు అన్నాం కదా! మనకూ ఏడుపే అధికారభాష. నవ్వు అఫ్‌కోర్స్ వ్యావహారిక భాష — ఒక్కనవ్వుతో ఎంత ఏడుపునైనా దిగమ్రింగవచ్చు.

పిల్లల మాటలు, వారి సంజ్ఞలూ వచ్చిన చుట్టాలకుగాని, ఆఖరికి చేసుకున్న మొగుడికైనా అర్థంకావాలంటే మనవే అనువదించి చెప్పాలి గదా! మనం చేసే సాధికారిక అనువాదాలే మన యింట్లో వాళ్ళు ఫాలో అయేది. పాప ఏం కావాలంటుందే! అని గోలెడతారు మగాళ్ళు. మనం చెప్పిందే వేదం— పిల్లల భాష పాపలందరికీ ఒకటే కాదు. ప్రతితల్లీ తన పాప భాషను తెనిగించి చెప్పకపోతే ఈ భాషాసమస్య మరీ క్లిష్టం అయిపోకతప్పదు. అదుగో మా పాప "బాచ్చీన్" అంటోంది. "బాచ్చీన్ అంటే మంచినీళ్ళు. అడుగో మా చిన్నాడు "ముస్తకం" కోసం ఏడుస్తున్నాడు. ముస్తకం అంటే పుస్తకం అన్నమాట. మా మూడోపిల్ల "పాము" అంటోంది. పాము అంటే చీమ అన్నమాట. పాము

అంటే చీమ కాదా? తెల్లబోతారేఁ అది అంతేలెండి. పిల్లలభాష పిల్లల తల్లుల్నడిగి తెలుసుకోండి.

“సెమ్మా అంటే తెలుసా సినిమా, “లేలి” అంటే చెప్పుకోండి చూద్దాం. తెలీదూ- రేడియో అన్నమాట, “తొండ” అంటే ఏవిటను కున్నారు కొండ. ఇంకా ఇలా చాలానే వున్నాయి సాంకేతిక పదాలు, ఇవన్నీ మావారికి అర్థమయేలా ఒక శ్వేతపత్రం తయారు చేద్దామను కుంటున్నా. (మా కమిటీలో పిల్లల తల్లులకే చోటు) పిల్లల మాటలన్నీ ప్రోగుచేసి వెన్నెలపండ గ్రుచ్చుతా. ఆ వెన్నెల దండ తీసికెళ్ళి చెప్పు కోండి ఎవరి మెళ్ళో వేస్తానో....